రైతులు ప్రకృతి సేద్యం చేయాలి

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు



ప్రకృతి వ్యవసాయ విధానంతో పండించిన పంటను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నరసరావుపేట: జిల్లాలోని రైతులందరూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకొని ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఐ.మురళి సందర్శించారు. ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల శ్రేయస్సు కోసం వ్యవసాయ శాఖలో భాగమైన ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రైతుల శ్రేయస్సు కోసం ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక తొమ్మిది సూత్రాల గురించి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి వివరించారు. భూమిని 365 రోజులు పచ్చని పంటలతో కప్పి ఉంచటం వలన భూమికి నిరంతరం కర్బనం చేకూరుతుందని, భూమిలో సూక్ష్మజీవులు శిలీంద్రాల ఉధృతి పెరుగుతుందన్నారు. తద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. భూమిపై పంటల వైవిధ్యం పెంచాలని వ్యవసాయ క్షేత్రంలో పంటల వైవిధ్యం తీసుకురావాలంటే రక్షక, ఆకర్షణ, జీవవైవిధ్య పంటలు వేయడం ద్వారా ప్రధాన పంటకు చీడపీడల ఉధృతి తగ్గుతుందని అన్నారు. పంట వ్యర్థాలను భూమిలో కలిపి కప్పి ఉంచడం ద్వారా భూమికి సూర్యరశ్మి నుంచి రక్షణ లభించి భూమికి కొంత మేర కర్బన పదార్థం చేకూరుతుందన్నారు. భూమిని దున్నకపోవడం వలన భూమిలో సూక్ష్మజీవుల వృద్ధి జరిగి సూర్య తాపం భూమిలోని సూక్ష్మ జీవులపై పడకుండా ఉంటుందన్నారు. తద్వారా కర్బన శాతం గాలిలో ఆవిరి కాకుండా ఉంటుందని అన్నారు. రైతు తన సొంత విత్తనాన్ని తానే తయారు చేసుకోవడం వలన ఖర్చు తగ్గి చీడ పీడల నుంచి తట్టుకునే శక్తి పంటకు లభిస్తుందన్నారు. పశువుల అనుసంధానంతో రైతులకు అదనపు ఆదాయం లభించి ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఉపకరణాలు తయారు చేసుకోవడంలో సహాయ పడతాయని పేర్కొన్నారు. చీడపీడల నివారణ కోసం సహజ సిద్ధమైన కషాయాలు తయారు చేసుకుని ఎట్టి పరిస్థితుల్లో రసాయన ఎరువులు రసాయన పురుగు మందులు కలుపు మందులు ఉపయోగించకూడదని పేర్కొన్నారు. ఈ సార్వత్రిక సూత్రాలను ప్రతి రైతు ఆచరించాలని చెప్పారు. దీని వలన పర్యావరణానికి, భూమికి, నీటికి ఎటువంటి హాని జరగదని చెప్పారు. అధికారులు రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంతగుడిపాడులో ఉచిత వైద్యశిబిరం



రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల సొసైటీ కార్యాలయ ఆవరణలో బుధవారం నరసరావుపేటకు చెందిన గ్లోబల్ హెల్త్ హోమియో క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎం.వెంకటేష్ రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన 60 మంది రోగులకు బీపీ, షుగర్, బాడీ చెకప్, మోకాళ్ళ నొప్పులు, గ్యాస్, అలసట, ఎలర్జీ, ఉబ్బసం, ఆయాసం, చర్మవ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ చేశారు. అనంతరం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగా స్ట్రీట్‌లో విద్యుత్‌శాఖ ఉద్యోగుల యోగాసనాలు



నరసరావుపేట: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దచెరువు యోగా స్ట్రీట్‌లో విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఆసనాలు వేశారు. ఆ శాఖ జిల్లా అధికారి పి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సీహెచ్.రాంబొట్లు, వై.ఏడుకొండలు, ఆనందకుమార్, బంగారయ్య, మహిళా ఉద్యోగులు పాల్గొని యోగాసనాలు వేశారు. దీనిలో పెద్దసంఖ్యలో ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పశు వైద్యసహాయ సంచాలకులకు ఘనస్వాగతం



వినుకొండ: వినుకొండ పశువైద్య సహాయసంచాలకులుగా డాక్టర్ నేలపల్లి రాములు పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం వినుకొండ నియోజకవర్గంలోని వెటర్నరీ వైద్యులు, సహాయకులు శ్రీరాములు దంపతులను ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. గతంలో పనిచేసిన సరోజాదేవికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ వినుకొండ ఏరియా ఆస్పత్రి పరిధిలోని రైతులందరూ పశు వైద్యసేవలు సద్వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో పశువైద్యసేవలు సక్రమంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఏపీపీ కల్పన, వినుకొండ ఏజీపీ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, ఈపూరు సహాయ సంచాలకులు పి.శ్రీనివాస మూర్తి, పశువైద్యులు డాక్టర్ అమీర్‌బాష, శివాజీ, గోపాలనాయక్, కవిత, గణేష్, మనోజ్, లతోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలెమర్రు ఎంపీపీ పాఠశాలకు అదనపు ఉపాధ్యాయ పోస్టు

బాలెమర్రు(క్రోసూరు): మండలంలోని బాలెమర్రు ఎంపీపీ పాఠశాలకు అదనంగా ఉపాధ్యాయ పోస్టు భర్తీ అయినట్లు పాఠశాల హెచ్‌ఎం శరత్ బుధవారం తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఏకోపాధ్యాయ ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగటంతో ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా అదనంగా ఉపాధ్యాయ పోస్టు కేటాయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయురాలు విప్పర్ల సాహిత్య కుమారి చేరినట్లు పేర్కొన్నారు. అదనపు పోస్టు రావటం పట్ల గ్రామస్తులు, ఎస్‌ఎంసీ అధ్యక్షుడు బి.రాధాకృష్ణ సంతోషం వ్యక్త పరిచారు.

మా భూములపై హక్కు కల్పించండి

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన 16 మంది రైతులు తమకు డీకే పట్టాల రూపంలో కేటాయించిన 19 ఎకరాల భూమిపై ఉన్న వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దారు ఎం.సరోజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 1993లో సర్వే నెంబరు 321-1లో 100 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ డీకే పట్టాలు ఇచ్చారని అందులో 16 మందికి చెందిన 19 ఎకరాల భూమి అడవిపందుల బెడద వల్ల సాగు చేసుకోలేక పోయామన్నారు. ఇటీవల ఈ భూములకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు వచ్చే అవకాశాలుండటంతో సాగు చేసుకునేందుకు ప్రయత్నం చేయగా.. ఈ భూములు అటవీ శాఖ కిందకు వస్తాయంటూ అటవీ శాఖ వారు అభ్యంతరం చెబుతున్నారని, తమపై కేసులు రాస్తున్నారని చెప్పారు. సమస్యను పరిష్కరించి తమకు కేటాయించిన భూములపై హక్కులు కల్పించవలసినదిగా ఎన్నోసార్లు రెవెన్యూ వారికి మొరపెట్టుకుంటున్నా వినిపించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

ఫిర్యాదులకు తావులేకుండా విధులు నిర్వహించాలి

- ఏడీఏ బోయపాటి రవిబాబు
- రైతుల ఫిర్యాదులపై విచారణ
- వేల్పూరు-2 రైతుసేవా కేంద్రం వీఏఏ సరెండర్
- కొత్తలూరు, పోట్లూరు, కారుమంచి వీఏఏలకు షోకాజ్ నోటీసులు



విచారణ చేస్తున్న వ్యవసాయ అధికారులు

శావల్యాపురం: రైతుసేవా కేంద్రాల్లో వీఏఏలు ఫిర్యాదులకు తావులేకుండా మెరుగైన సేవలు రైతులకు పారదర్శకంగా అందించాలని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. బుధవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు రైతుల నుంచి లంచం తీసుకుంటున్నారని ఫిర్యాదులు రావడంతో మండలంలోని వేల్పూరు-2, కారుమంచి, పోట్లూరు, కొత్తలూరు రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను రైతుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు-2 రైతుసేవా బహుళ సార్థక విస్తరణా అధికారి (ఎంపీఈవో) రేగుళ్ళ హరిబాబు పనితీరుపై సక్రమంగా లేదని రైతుసేవా కేంద్రానికి వెళ్లిన రైతులకు సరైన సమాధానం చెప్పటం లేదని వెలమవారిపాలెం గ్రామానికి చెందిన రైతుల నుంచి అన్నదాత సుఖీభవ పథకం ఈకేవైసీ నమోదు చేయడానికి ఒక్కొ రైతు నుంచి రూ. 500 రూపాయలు తీసుకున్నట్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఏడీఏ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అలాగే మండలంలోని కారుమంచి, పోట్లూరు, కొత్తలూరు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రం వీఏఏలు ఈకైవైసీ నమోదు చేయడానికి లంచం అడిగినట్లు రైతుల నుంచి ఆరోపణలు అందినట్లు తెలిపారు. వేల్పూరు-2 ఎంపీఈవో హరిబాబు పనితీరుపై క్షేత్రస్థాయిలో విచారణ చేయగా నిజాలు నిర్ధారణ కాగా లంచం తీసుకున్నట్లు వెల్లడైందన్నారు. సత్వరమే ఇక్కడ విధులు నుంచి తప్పించి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి హరిబాబును సరెండర్ చేస్తున్నట్లు తెలిపారు. ఈకేవైసీ నమోదుపై లంచం అడిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఏఏలకు షోకాజు నోటీసులు అందజేశామన్నారు. రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలు సమయపాలన పాటించాలని, రైతుసేవా కేంద్రాల్లో నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన రైతులతో వ్యవసాయ అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక, వీఏఏలు ఉన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

- 13 వాహనాలపై కేసులు నమోదు
- రూ.90 వేలు అపరాధం రుసుం



స్వాధీనం చేసుకున్న ఆటోలతో అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: చిలకలూరిపేట నుంచి నరసరావుపేటకు వచ్చే రహదారిలో బుధవారం అధికారులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేసి 13 వాహనాలపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించాలనే కలెక్టర్ ఆదేశంతో పోలీసు, రవాణా, ఆర్టీసీ అధికారులు తనిఖీలో పాల్గొని ఇన్సూరెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేని, పన్ను చెల్లించని, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. సుమారు 45 వాహనాలను తనిఖీ చేసి 13 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా రవాణా అధికారి సంజీవకుమార్ పేర్కొన్నారు. ఇన్సూరెన్సు సర్టిఫికెట్ లేనివి ఏడు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేనివి ఆరు, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేని ఐదు, పర్మిట్ లేని ఒక వాహనం, డ్రైవింగ్ లైసెన్స్‌లేని తొమ్మిది వాహనాలు ఉన్నాయన్నారు. వీటిలో మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని భద్రత నిమిత్తం ఆర్టీసీ డిపోకు తరలించామన్నారు. అపరాధ రుసుం కింద రూ.90,820లు వసూలు చేశామన్నారు. చిలకలూరిపేట ఆర్టీసీ డీఎం రాంబాబు, ఎంవీఐ కేఎల్ రావు, సీ.ఐ, ఎస్.ఐ, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, దీనివల్ల రోడ్లపై జరిగే ప్రమాదాలను నిర్మూలించవచ్చని తెలిపారు.

పచ్చిరొట్ట పైరును భూమిలో కలియదున్నాలి

ఏవో కె.దేవదాసు

నకరికల్లు: పచ్చిరొట్ట పైరు పూతదశలో ఉన్నప్పుడు భూమిలో కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాన్ని దున్ని భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు పచ్చిరొట్ట విత్తనాలను చల్లి 45 రోజులలోపు పైరు పూత దశలో ఉన్నప్పుడు పైరును భూమిలో కలియదున్నాలన్నారు. ఎకరాకు 100 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లాలన్నారు. తద్వారా పచ్చిరొట్ట పైరు త్వరగా కుళ్లిపోయి భూమికి బలం చేకూరుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం ద్వారా భూసారం, నేలలో నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఫలితంగా ప్రధాన పంటలో 25 శాతం రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జి.జగదీష్, ఏఈఓ కే దిలీప్ కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయమే పొలం పిలుస్తోంది లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఆంజనేయుల నాయక్

నూజెండ్ల: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తుందని మండల వ్యవసాయ అధికారి ఎ.ఆంజనేయుల నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అయినోలు, ముక్కెళ్ళపాడు, రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు విత్తన ఎంపిక కొనుగోలు చేయు సమయంలో జాగ్రత్తలు పాటించటంతో పాటు వ్యవసాయ అధికారులు సూచనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. అలాగే ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు సంబంధిత దుకాణాదారుడు నుంచి బిల్లు తీసుకోవాలన్నారు.
అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ యోజన పథకానికి సంబంధించి 10138 వేల మంది లబ్ధిదారులను గుర్తించగా 9889 మంది రైతుల నుంచి ఈకేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు. అన్ని రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఎల్.ఏ లీషా, ఉద్యాన సహాయకులు మణికంఠ, మురళీకృష్ణ రైతులు పాల్గొన్నారు.

లింగరావుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న ఏవో కోటయ్య

యడ్లపాడు: మండలంలోని లింగరావుపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వనరుల కేంద్రానికి చెందిన వ్యవసాయ అధికారి ఎస్.కోటయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు రైతులు అనుసరించవలసిన సమకాలీన సాగు పద్ధతులు, సేంద్రియ వ్యవసాయ ప్రయోజనాలపై ఆయన వివరంగా అవగాహన కలిపారు. జీవామృతం, అగ్నిఅస్త్రం తయారీ విధానాలు, వాటి ప్రయోజనాలపై రైతులకు ప్రాక్టికల్‌గా సూచనలు చేశారు. ఖరీఫ్ పంటల సాగులో విత్తనశుద్ధి, మట్టి లోపల, పైభాగంలో పాటించాల్సిన జాగ్రత్తలు, మట్టిసామర్థ్యం పెంచే సాంకేతికతలపై ఫలవంతమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగం ఏఈఓ జీవన్‌నాయక్, గ్రామ పెద్దలు సాధినేని సుధీర్, తోకల రాజేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ హజరాబీ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 12 మందికి గాయాలు



పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల గ్రామంలో బుధవారం వీధుల వెంట తిరుగుతూ నడుచుకుంటూ వెళుతున్న వారిపై పిచ్చికుక్క దాడి చేయగా 12 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. వారిలో నలుగురు చిన్నారులున్నారు. పిచ్చికుక్క దాడిలో గ్రామానికి చెందిన పాటిబండ్ల స్వాతి, పాటిబండ్ల మహేష్, పాటిబండ్ల జాషువారత్నకుమార్, పాటిబండ్ల బ్లెస్సి, ప్రస్త, పాటిబండ్ల పాములు, పాటిబండ్ల సామ్రాజ్యం, మండపల్లి నాగమణి, బంక నవీన్, కుక్కమల్ల దివ్య, తమ్మి జోసెఫ్, మెయిజే తదితరులు గాయాలపాలయ్యారు. బాధితులను పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండల వ్యాప్తంగా కుక్కల దాడులు తీవ్రంగా ఉన్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ పోలెపోగు రాములు మాదిగ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రొంపిచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ పోలెపోగు రాములు మాదిగ అన్నారు. మండలంలో రామిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మక్కెన పుట్టయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలెపోగు రాములు మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వములు వచ్చిన ఎస్సీల బ్రతుకులలో మార్పు రాలేదన్నారు. ఎస్సీ కాలనీలలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన ఉద్యమాల వలన ప్రభుత్వాలలో కదిలిక వచ్చిందన్నారు. వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భించి 31 సంవత్సరాలు కావస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ఆ రోజు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శ్యామ్యూల్, మస్తాన్, దాసు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా సీపీఐ మండల కార్యవర్గం

మండల కార్యదర్శిగా మస్తాన్‌బుజ్జి



అచ్చంపేట: అచ్చంపేట మండల సీపీఐ మండల కార్యవర్గాన్ని నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా షేక్ మస్తాన్‌బుజ్జితో పాటు మరో 8 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ బుజ్జి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

బాబూ... నిరుద్యోగ భృతి ఏదీ?

అఖిలభారత యువజన సమాఖ్య ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: సూపర్ సిక్స్ హామీల్లో భాగమైన నిరుద్యోగ భృతి పథకాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అఖిలభారత యువజన సమాఖ్య ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగ భృతి మాటే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ నిరుద్యోగుల బాధ్యత తనదని పదేపదే చెప్పారని, మంత్రి అయిన తర్వాత ఆ విషయమే మరిచిపోయారని విమర్శించారు. రాష్ట్రంలో చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలస వెళ్లే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు రూ. 3వేల చొప్పున భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు లక్ష్మీపతి, వెంకటేష్, ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చడంలో ప్రభుత్వం విఫలం

సీపీఎం నాయకులు విమర్శ



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నరసరావుపేట రూరల్: రైతు ప్రభుత్వమని చెబుతూ రైతులకు లబ్ధిచేకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు విమర్శించారు. జిల్లాలో పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం పట్ల వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం 1వ, 2వ పట్టణ కార్యదర్శులు షేక్ సిలార్ మసూద్, సయ్యద్ రబ్బానిలు మాట్లాడుతూ నాదెండ్ల మండలం రామాపురం కాలనీ, తూబాడు గ్రామాల్లో కౌలు రైతులు సస్యం ఆదినారాయణ, చిరుబోయిన గోపాలరావు, ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామంలో బండి కొండయ్యలు ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో వ్యవసాయానికి 80 శాతం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తూ పంటలను ప్రభుత్వాలే మద్దతు ధర కొనుగోలు చేసి ఆదుకుంటున్నాయని తెలిపారు.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ విధానాల కారణంగా వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారని తెలిపారు. సీపీఎం కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ వ్యవసాయం కోసం చే సిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మగౌరవం కోసం ఆత్మహత్యలు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొమ్ముల నాగేశ్వరరావు, కొండ్రు ఆంజనేయులు, ఖాసీం, సుభాష్ చంద్రబోస్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

కాబోయే రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్



తోపుడు బండ్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్న డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్

చిలకలూరిపేట: పేద కుటుంబాల్లో వెలుగులు నింపడమే రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ జిల్లా కాబోయే గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో రోటరీ చేయూత చక్రాలు అనే కార్యక్రమం ద్వారా 28 మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన రాంప్రసాద్ మాట్లాడుతూ వివిధ రోటరీ క్లబ్‌ల సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహాయం అందుకున్న చిరువ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి ఎదిగేందుకు కృషి చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు జాష్టి రంగారావు, లంకా ఆదినారాయణ రెడ్డి, వారణాసి శరత్ కుమార్, బోనం వెంకటేశ్వరరావు, ఆళ్ల వేమనరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

పీసపాడు(క్రోసూరు): శాంతిభద్రతల కొరకు పోలీసులు నిరంతరం కృషి చేస్తారని, కావున ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ పి.రవిబాబు అన్నారు. మంగళవారం రాత్రి పీసపాడు సచివాలయం వద్ద పల్లెనిద్రలో భాగంగా గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవిబాబు మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకున్నా ప్రజలు తమ దృష్టికి తేవాలన్నారు. అప్పుడే నేరాలు అరికట్టగలమని, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బెట్టింగుల్లో పాల్గొనటం, పేకాట, గుట్కా విక్రయాలు, మహిళలపై అసభ్య ప్రవర్తనలు వీటన్నింటికీ ప్రత్యేక శిక్షలుంటాయని చెప్పారు.

సంస్మరణ సభ జయప్రదం చేయండి

ప్రజాసంఘాల నాయకులు



నరసరావుపేట: పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడి అమరులైన దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు ఎన్.క్రాంతికుమార్, దేవరపల్లి పున్నారావుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం బస్టాండ్ సెంటర్‌లో ప్రజా సంఘాల నాయకులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన విజయవాడలోనే గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో పీడీఎం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సంస్మరణ సభ జరుగుతుందన్నారు. ప్రజలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు పోస్టర్లను ప్రదర్శించారు. సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మా ఊరికి బస్సు వచ్చిందోచ్



రొంపిచర్ల మండలంలోని వడ్లమూడి వారిపాలెంకు చాలా కాలం తర్వాత ఆర్టీసీ బస్సు రావటం పట్ల బుధవారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఈపూరు మండలం బొగ్గరం గుండా వడ్లమూడి వారిపాలెం, విప్పర్లపల్లి, మునుమాక గ్రామాలను కలుపుతూ జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చేరుతుంది. తిరిగి ఇదే రూట్‌లో వినుకొండకు బయలుదేరి వెళ్తుంది. ప్రతిరోజు గ్రామానికి వచ్చే బస్సుకు రోడ్డుపై ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దని గ్రామస్తులు నిర్ణయించారు. రోడ్డుపై ఎలాంటి అడ్డంకులు గానీ, ఆక్రమణలు గాని చేయవద్దనుకున్నారు. తమ గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సును ఆపి డ్రైవర్, కండక్టర్‌లకు అభినందనలు తెలిపారు. -రొంపిచర్ల